
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

శుక్రవారం 25 అక్టోబరు 2024



రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిని పూర్తి చేయండి

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని చటాన్‌పల్లి రైల్వే క్రాసింగ్‌పై ఫ్లైఓవర్ బ్రిడ్జిని పూర్తి చేయాలని, కేశంపేట రోడ్డు రైల్వే క్రాసింగ్‌పై మరో బ్రిడ్జి నిర్మించాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన మంత్రి.. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని రైల్వే జీఎంను ఆదేశించారని శ్రీవర్ధన్‌రెడ్డి వివరించారు.



పూదోట.. మదిని దోచెనట

పండగల వేళ బంతి పూలకు యమా గిరాకీ ఉంటుంది. అందుకే వానాకాలంలో రైతులు ఈ పూలను అధికంగా సాగు చేస్తుం టారు. యాచారం మండల పరిధిలోని చౌదర్‌పల్లి గేటు వద్ద సాగర్- హైదరాబాద్ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ఓ వ్యవసాయ పొలం వద్ద రెండు రకాల్లో బంతిపూలను సాగు చేశారు. ప్రస్తుతం తోటలో పూలు విరగబూసి కనువిందు చేస్తున్నాయి. ఆ దారి వెంట వెళ్లే కొందరు ప్రయాణికులు తోటలోకి వెళ్లి సెల్‌ఫోన్లలో ఫొటోలు దిగుతూ సంబుర పడుతున్నారు.

- యాచారం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి)

నిలిచిన రోడ్డు పనులు

పొలంలో నుంచి బీటీ వేయొద్దని అభ్యంతరం

అర్ధంతరంగా నిలిచిన నిర్మాణం

అధ్వానంగా లచ్చంపేట్-లాలాపేట్ దారి

రాకపోకలకు అవస్థ పడుతున్న ప్రజలు



8

నీటిని సంరక్షించుకోవాలి

జీవ వైవిధ్యం దెబ్బతింటే మానవాళి

మనుగడకే ప్రమాదం

ఏపీ మాజీ సీఎస్ జవహర్‌రెడ్డి



7

కాంగ్రెస్ విఫల ప్రభుత్వం

హామీల అమలులో ఘోర వైఫల్యం

అడుగడుగునా అభివృద్ధిని అడ్డుకుంటుంది

మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



8

దొడ్డిదారి!

జిల్లాలో ఇష్టానుసారంగా డిప్యుటేషన్లు

ఉపాధ్యాయుల విధులు ఒకచోట.. జీతం మరోచోట

చౌదరిగూడ పాఠశాల నుంచి తెలుగు టీచర్ డిప్యుటేషన్

ఆర్డర్ రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా

"జిల్లా విద్యాశాఖలో అడ్డగోలుగా డిప్యుటేషన్లు చేపడుతున్నారు. విద్యా సంవత్సరం మధ్యలో ఉన్న చోటు నుంచి వేరే ప్రాంతానికి టీచర్లను పంపించడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. సబ్జెక్టులు బోధించే వారు లేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అక్రమ డిప్యుటేషన్లు ఆపాలని పిల్లల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘ నాయకులు కోరుతున్నారు.



రంగారెడ్డి అర్బన్/చౌదరిగూడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖలో దొడ్డిదారిన అక్రమ డిప్యుటేషన్ల పర్వం కొనసాగుతోంది. ప్రభుత్వం నియమించిన చోట టీచర్లు పనిచేయడం లేదు. తమకు నచ్చిన చోట పనిచేసేందుకు టీచర్లు అక్రమ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. పల్లెలు, గిరిజన తండాల్లో పనిచేయడం ఇష్టం లేక పట్టణాలకు డిప్యుటేషన్‌పై వెళుతున్నారు. ఫలితంగా మారుమూల ప్రాంతాల్లో పాఠశాలలు మూతబడే పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వారికి కేటాయించిన ప్రాంతంలోనే పనిచేయాలని నిర్దిష్ట ఆదేశాలు జారీ చేసినప్పటికీ జిల్లాలోని విద్యాశాఖలో అవేవి పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. రాజకీయ నేతల ఒత్తిళ్లు, పలుకుబడి సంఘాల పెత్తనం ఎక్కువై యథేచ్ఛగా డిప్యుటేషన్లు కొనసాగుతున్నాయి. హెచ్‌ఆర్‌ఏ అధికంగా వచ్చే ప్లేస్‌లోకి వెళ్లేందుకు టీచర్లు పోటీ పడుతున్నారు. గ్రామీణ ప్రాంతంలో విధులు నిర్వర్తించే టీచర్లకు హెచ్‌ఆర్‌ఏ ఎక్కువగా ఇస్తే డిప్యుటేషన్లకు చెక్ పెట్టవచ్చని కొందరు అభిప్రాయపడుతున్నారు. డిప్యుటేషన్ విధానాన్ని అనుమతించేది లేదని ఉన్నతాధికారులు ప్రభుత్వ ఉత్తర్వులు

మిగతా 8వ పేజీలో...

"ఈ నెల 19న ఆమనగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ జ్యోతికి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తాటి అన్నారం జెడ్పీ హెచ్‌ఎస్‌కు, 21న చౌదరిగూడ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో తెలుగు సబ్జెక్టు బోధిస్తున్న కె. శైలజను వనస్థలిపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు డిప్యుటేషన్ వేశారు.

డిప్యుటేషన్లు రద్దు చేయాలి

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన

8

అక్రమ బదిలీలు అరికట్టాలి

కలెక్టర్‌కు టీఎస్‌యూటీఎఫ్ వినతి

జిల్లాలో నేడు

మున్సిపల్ కార్మికుల ధర్నా

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని శుక్రవారం పురపాలక పట్టణాభివృద్ధి శాఖ (సీడీఎంఏ) కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ ఇబ్రహీంపట్నం మున్సిపల్ కన్వీనర్ సీహెచ్.ఎల్లేష్ తెలిపారు. ఇందుకు అనుమతి కోరుతూ గురువారం మున్సిపల్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు.

సామాజిక తనిఖీ

కేశంపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేడు(శుక్రవారం) ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక చేపడుతున్నట్లు కేశంపేట ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధిహామీ కూలీలు, యువజన సంఘాల సభ్యులు, మేధావులు హాజరుకావాలని కోరారు.

నియామకం

నూతన కమిటీ ఎన్నిక

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడిగా వంగాల కృష్ణప్రసాద్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పల్లాటి రాములు తెలిపారు. గురువారం పట్నంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గుండె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మచ్చ మహేందర్, కార్యదర్శిగా గోరేటి కుమార్, కోశాధికారిగా బంగారుగల్ల మహేందర్‌లను నియమించినట్లు తెలిపారు. సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి గ్యార జగన్, జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్, దార యాదగిరి, కొండ్రు రఘుపతి పాల్గొన్నారు.



గతంలో మాచునూరు గ్రామం ఉన్న ప్రాంతం

పేరు ఉంది.. ఊరే లేదు!

7

వందల ఏళ్లుగా కనిపించని జనం

దర్శనమిస్తున్న చారిత్రాత్మక సాక్ష్యాలు

ఆ గ్రామం పేరుతో రెవెన్యూ భూములు

తాండూరు మండలం 'మాచనూరు'పై ప్రత్యేకం

జనం లేని ఊరేమిటని ఆశ్చర్యపోతున్నారా? అక్కడ ఊరు ఉండదు.. కానీ ఊరు ఉన్నట్లు సజీవ సాక్ష్యాలు కనిపిస్తాయి. రెవెన్యూ భూములు కూడా ఆ పల్లె పేరిటే కొనసాగుతున్నప్పటికీ జనం మాత్రం కనిపించరు. తాండూరు మండలం గోనూరు పంచాయతీ అనుబంధ గ్రామంగా ఉన్న మాచనూరుపై ప్రత్యేక కథనం.

తాండూరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి)

మోడల్ గ్రామాలుగా అభివృద్ధి

» ఎంపీడీవోలు చొరవ చూపాలి » కలెక్టర్ శశాంక



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మోడల్ గ్రామాలుగా మార్చేందుకు ఎంపీడీవోలు నాంది పలకాలని కలెక్టర్ శశాంక సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో మండల అభివృద్ధి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ పిట్ టాయిలెట్లను ట్విన్ పిట్ టాయిలెట్లుగా మార్చాలన్నారు. అన్ని సెప్టిక్ ట్యాంక్ టాయిలెట్లు సమీపంలోని ఎఫ్ఎస్‌టీపీకి అనుసంధానం చేయాలన్నారు. రెసిడెన్షియల్ స్కూల్, టూరిస్టు ప్రాంతాల్లో, బస్టాండ్‌లో, దేవాలయాల దగ్గర, ఆసుపత్రి ఆవరణలో, మార్కెట్ పరిసర ప్రాంతాలో జనాలు ఎక్కువగా ఉన్న చోట కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు నిర్మించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను యూనిట్‌కు పంపించి వాటిని క్లీనింగ్, ముక్కలు చేయడానికి సరైన మెషినరీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రే వాటర్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా అన్ని గ్రామాల్లో కమ్యూనిటీ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలన్నారు. కమ్యూనిటీ సోక్‌పిట్‌లను అన్ని ప్రభుత్వ భవనాల్లో నిర్మించాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, సీపీవో సౌమ్య , మండల అభివృద్ధి అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 7న కుల సమగ్ర సర్వేపై బహిరంగ విచారణ

కుల సమగ్ర సర్వేపై జిల్లా కేంద్రంలో సదస్సు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. వెనుకబడిన తరగతుల, సంచార జాతుల సమగ్ర కుల సర్వేలో భాగంగా వచ్చేనెల 7న కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ ఉంటుందన్నారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషా పద్ధతిపై కమిషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందుకోసం బీసీ సంఘాలు, సంచార జాతుల సంఘాల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంతరాలు కమిషన్ తీసుకుంటుందని తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు బీసీ, సంచార జాతుల కుల పెద్దలు, కమిషన్ ఇచ్చే నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్‌తో పాటు ఆరు సెట్లతో తెలుగు/ఇంగ్లీష్ భాషలో నవంబర్ 7న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతున్న బహిరంగ విచారణకు హాజరై నివేదిక ఇవ్వాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

అట్టహాసంగా జిల్లాస్థాయి

కబడ్డీ పోటీలు

» ప్రారంభించిన డీఈవో సుశీందర్ రావు

కడ్తాల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు కడ్తాల మండల కేంద్రంలోని బట్టర్ ఫ్లై స్కూల్‌లో గురువారం అట్టహాసంగా నిర్వహించారు. రాష్ట్రస్థాయి జట్టు ఎంపిక కోసం నిర్వహించిన అండర్ -14, అండర్ -17 కబడ్డీ పోటీలకు జిల్లాలోని 27మండలాల పరిధిలోని 8 జోన్ల నుంచి 400మంది విద్యార్థులు హాజరయ్యారు. కడ్తాల సీఐ శివప్రసాద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, ఎంఈవో సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు జంగయ్య, జోనల్ కార్యదర్శి భీముడుతో కలిసి 68వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను డీఈవో సుశీందర్ రావు ప్రారంభించారు. కార్యక్రమంలో పీఈటీల సంఘం రాష్ట్ర బాధ్యులు రాఘవ రెడ్డి, సుధాకర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, జోనల్ కార్యదర్శులు భీముడు, గాంగ్యానాయక్, రాజశేఖర్‌రెడ్డి, రవి, సుశీల, ప్రభాకర్, ప్రధానోపాధ్యాయులు అరుణ, శ్రీనివాసులు, జంగయ్య, మాజీ సర్పంచ్ ఎల్ఎస్ రెడ్డి, పార్ట్యాన్ బట్టర్ ఫ్లై స్కూల్ ప్రిన్సిపాల్ సంజీవ్ నాంపల్లి, మహమూద్, మల్లయ్య, చంద్రమోహన్ పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

ఇంటి రిజిస్ట్రేషన్ పత్రం జారీ చేయడం లేదని..

» క్రిమిసంహారక మందుతాగి వ్యక్తి ఆత్మహత్యా యత్నం

» యాచారం మండలం చౌదర్‌పల్లి జీపీ కార్యాలయం వద్ద ఘటన



గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మధుసూదన్

యాచారం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : ఇంటి రిజిస్ట్రేషన్ పత్రం జారీ చేయడంలో గ్రామపంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. యాచారం మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన ముక్కెర మధుసూదన్(35) తన ఇంటిని గ్రామపంచాయతీ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించి బ్యాంకులో అప్పు తీసుకోవాలనుకున్నాడు. ఈ రుణంతో అప్పు తీర్చడంతో పాటు తనకున్న భూమిలో పంట సాగు చేసుకోవాలనుకున్నాడు. బ్యాంక్ లోన్ కావాలంటే ఇంటి రిజిస్ట్రేషన్ పత్రం తప్పనిసరి అని బ్యాంక్ అధికారులు సూచించారు. దాంతో ఆరు నెలలుగా ఇంటిని రిజిస్ట్రేషన్ చేసి పత్రాలివ్వాలని బాధితుడు ముక్కెర మధుసూదన్ పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. కార్యదర్శి జ్యోత్స్న రేపూమాపు అంటూ తిప్పించుకుంటోందని బాధితుడు ఆరోపించాడు. తనకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రం ఇవ్వాలని గురువారం కార్యదర్శిని కోరాడు. లేదంటే క్రిమిసంహారక మందు తాగుతానని కార్యదర్శితో చెప్పాడు. దాంతో ఆమె తనను బెదిరిస్తున్నావా? అని అన్నారు. ఈక్రమంలో మధుసూదన్ పంచాయతీ కార్యాలయం ఎదుట క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న అతడి భార్య దానమ్మ కుటుంబ సభ్యుల సాయంతో నగరంలోని గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లింది. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉందని సమాచారం. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్నను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ఇంటి రిజిస్ట్రేషన్ పత్రం ఇవ్వాలని అనుకున్నా.. పని ఒత్తిడి కారణంగా ఆలస్యమైందని తెలిపారు. ఆస్తి ధ్రువీకరణ పత్రం గురువారం ఇవ్వాలనుకున్నా. కానీ, మధుసూదన్ ఇలా చేస్తాడని అనుకోలేదని చెప్పుకొచ్చారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

కందుకూరు, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): పులిమామిడి జడ్పీ పాఠశాల విద్యార్థులు ముగ్గురు అండర్-17 జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 22న శంకర్‌పల్లి మండలం మోకిలో జరిగిన జిల్లాస్థాయి అండర్-17 వాలీబాల్ పోటీలు జరిగాయని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పి.స్వామి తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు కొర్ర రాహుల్, పి.తరుణ్, పి.కార్తీక్‌ల టీమ్ మొదటిబహుమతి సాధించిందన్నారు. వారు జిల్లా అండర్-17 వాలీబాల్ టీమ్‌కు ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 25న రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల పోటీలను వికారాబాద్‌లో నిర్వహిస్తామని, తమ పాఠశాల విద్యార్థులు రంగారెడ్డి జిల్లా తరఫున పాల్గొంటారన్నారు. హెచ్ఎం బుచ్చయ్యగుప్తా, టీచర్లు శ్రీనివాసులు, స్టాన్లీ, జయంతి, శ్రీవిద్య, చెన్నయ్య, రాములు, రామారావు, ప్రసన్న, శిరీషలు పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని కోరారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీఈటీ స్వామి, ఉపాధ్యాయులు

కబ్జా నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలి



తహసీల్దార్ దత్తుకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

శంషాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ పరిధిలోని ప్రభుత్వ భూమి కబ్జాచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని ప్రజల ఆస్తిని పరిరక్షించాలని గురువారం రెవెన్యూ కార్యాలయం వద్ద బీజేపీ నియోజకవర్గ నాయకులు ఆందోళన చేశారు. రాష్ట్ర నాయకులు ప్రేంరాజ్, కార్పొరేటర్ తోకల శ్రీనివా‌స్‌రెడ్డి మాట్లాడారు. శంషాబాద్‌లోని సర్వే నంబర్ 6,261లో హెచ్ఎండీఏకు 360ఎకరాలు, దాని పక్కనే బాలాజీ వెంచర్‌కు సమీపంలో 5.15ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల అండతో నాలుగైదురోజులుగా ఆ స్థలంలోకి కొందరు ప్రవేశించి భూమిలోని రాళ్లను డిటోనేటర్లతో పగలగొట్టి చదును చేశారన్నారు. 'ఇది ప్రభుత్వ భూమి' అని పెట్టిన బోర్డును పీకేశారని చెప్పారు. కళ్లముందే కబ్జా చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కబ్జా నుంచి భూమిని కాపాడాలని తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. వెంటనే చర్యలు తీసుకోకుంటే ప్రజల ఆస్తి పరిరక్షణకు బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కాగా ఈ విషయమై స్పందిస్తూ 24 గంటల్లో చర్యలు తీసుకుంటామని, కబ్జాదారులపై పోలీసు కేసు పెడతామని నాయకులకు తహసీల్దార్ దత్తు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్, మహిపాల్‌రెడ్డి, రాజు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ కబ్జాపై పోలీసు విచారణ



ప్రభుత్వ భూమిలో విచారణ చేస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ పట్టణం సర్వే నంబరు 262/1 ప్రభుత్వ భూమి కబ్జాపై పోలీసులు గురువారం విచారణ చేశారు. కబ్జాపై మూడు రోజుల క్రితం ఆర్ఐ కృష్ణ ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై రాంచంద్రయ్య, రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. రెవెన్యూ అధికారుల విచారణలో ప్రభుత్వ భూమి రియల్ఎస్టేట్ వ్యాపారి కేశవ్‌నాయుడు ఆధీనంలో ఉందని తేలిందని, అధికారుల ఫిర్యాదుతో పోలీసు చార్జ్‌షీట్‌లో అతడి పేరు చేర్చుతామని సీఐ బాల్‌రాజ్ తెలిపారు. ప్రభుత్వ భూమి కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలోనే నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు.

శంషాబాద్‌లో పోలీసుల తనిఖీలు



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లో గురువారం రాత్రి పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు అధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. పాన్‌షాప్‌లు, ప్రార్థన మందిరాలు, బస్‌స్టాండ్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ.. రెగ్యులర్ తనిఖీల్లో భాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. పాన్‌షాప్, కిరాణదుకాణాల్లో డ్రగ్స్ అమ్ముతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అందుకే విస్తృతంగా తనిఖీలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సీఐలు బాల్‌రాజ్, నరేందర్‌రెడ్డి, ఎస్సైలు రాంచంద్రయ్య, అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 35 మేకల మృతి



మేకల కళేబరాలు

షాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో 35మేక పిల్లలు మృతిచెందిన సంఘటన పోతుగల్‌లో గురువారం చోటుచేసుకుంది. మేకల కాపరి కార్ల శంకరయ్య తెలిపిన వివరాల మేరకు.. గ్రామ సమీపంలో అతడు మేకల మంద పెట్టాడు. పెద్దమేకలను మేతకు తోలుకుపోయి, పిల్ల మేకలను మంద వద్దే తడకల్లో ఉంచాడు. మేత నుంచి వచ్చేసరికి 30 మేక పిల్లలు, 5 పెద్ద మేకలను వీధి కుక్కలు కరిచి చంపేశాయి. దీంతో శంకరయ్య లబోదిబోమన్నాడు. తనకు జీవనాధారమైన మేకల మృతితో నష్టం వచ్చిందని, అధికారులు ఆదుకోవాలని కోరాడు.

ఎర్రమట్టి లారీకి జరిమానా

సబ్ కలెక్టర్ ఆదేశాలతో విధించిన మైనింగ్ ఏడీ



రూ.37,393 జరిమానా చెల్లించినట్టు వచ్చిన రిసిప్ట్

తాండూరు రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అనుమతులు ఓ చోట.. డంపింగ్ మరో చోటకు తరలిస్తున్న ఎర్రమట్టి లారీకి సబ్‌కలెక్టర్ ఆదేశాలతో మైనింగ్ అధికారులు జరిమానా విధించారు. మైనింగ్ ఏడీ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. పెద్దేముల్ మండలం పాషాపూర్ శివారులో జరీనా మినరల్స్‌కు చెందిన ఎర్రమట్టి లారీ(టీఎస్34 టీబీ2421)ని తాండూరు మండలం మల్కాపూర్‌లోని ఐసీఎల్ ఫ్యాక్టరీకి తరలించాలి. కానీ బట్వారం మండలానికి తరలిస్తున్నారు. గురువారం తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ ఎర్రమట్టి లారీని తనిఖీ చేశారు. విశాఖకు తరలించే వే బిల్లుతో బంట్వారానికి లారీని తరలించడాన్ని గమనించారు. ఆయన ఆదేశాలతో మట్టి లారీకి రూ.37,393 జరిమానా విధించినట్లు ఏడీ తెలిపారు. వే బిల్లుల ప్రకారమే ఎర్రమట్టిని తరలించాలని సబ్‌కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరిగితే లీజు రద్దు, క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని జరీనా మినరల్స్‌కు అధికారులు హెచ్చరించారు.

అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణానికి చర్యలు



అటవీ భూమిలో బీటీ రోడ్డు పనులకు కొలతలు తీయిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

తాండూరు రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జినుగుర్తి-తట్టేపల్లి రోడ్డు మార్గంలో ఆగిన బీటీ రోడ్డు పనులను తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. తాండూరు మండలం జినుగుర్తి నుంచి ఆడ్కిచర్ల మీదుగా తట్టేపల్లి వరకు 2016లో ప్రభుత్వం నాబార్డు పథకం కింద బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టింది. జినుగుర్తి తండా నుంచి గుండ్లమడుగుతండా వరకు అటవీ పరిధిలో ఉన్న 4కిలోమీటర్ల దూరంలో బీటీ రోడ్డు వేయకుండా గ్రావెల్ వేసి వదిలేశారు. దీంతో తట్టేపల్లి, ఆడ్కిచర్ల, గుండ్లమడుగు తండా, మైసమ్మగడ్డతండా, ఉద్దండాపూర్, బాయిమీదితండా వాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఈ రోడ్డు పనులపై ఫారెస్ట్ అధికారులతో సమీక్షించారు. తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, తహసీల్దార్ తారాసింగ్, రేంజర్ శ్రీదేవి సరస్వతిలతో కలిసి రోడ్డు స్థలాన్ని పరిశీలించారు. బీటీ ఎన్ని కిలోమీటర్లు వేయాలి? అనేదానిపై వివరాలు సేకరించారు. రోడ్డు కొలతలు తీశారు. అవసరమయ్యే నిధులపై ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్షించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. అధికారుల వెంట అటవీ సెక్షన్ ఆఫీసర్ పీర్యానాయక్, ఆర్అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ లాలప్ప, అటవీశాఖ ప్రతినిధి మల్లయ్య, కార్యాలయ ప్రతినిధి మాణిక్‌రావు తదితరులు ఉన్నారు.

నీటి వనరుల సంరక్షణ సామాజిక బాధ్యత

ఏపీ మాజీ సీఎస్ జవహర్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న ఏపీ మాజీ సీఎస్ జవహర్‌రెడ్డి

కడ్తాల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):జీవ కోటికి ప్రాణాధారమైన నీటిని కాపాడుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కేఎస్.జవహర్‌రెడ్డి అన్నారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లిలోని 'ది ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్కూల్ ఎర్త్ క్లబ్, యంగ్ ఎర్త్ లీడర్స్ నాలుగో బ్యాచ్ అవగాహన కార్యక్రమం గురువారం ముగిసింది. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి, అధ్యక్షురాలు కొర్పోలు లీలాలక్ష్మారెడ్డిల అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేఎస్.జవహర్‌రెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్త కె.పురుషోత్తంరెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ కన్వీనర్ మాధవరెడ్డి, ఛైర్మన్ రవీందర్‌రావు, విద్యావేత్త ఉపేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఖమ్మం, నిజామాబాద్, మహబూబాబాద్ జిల్లాల 80 మంది వ్యాయామ ఉపాధ్యాయులు సదస్సులో పాల్గొన్నారు. శిక్షణ పొందిన పీడీలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. జవహర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి, పర్యావరణం, జీవరాశుల పరిరక్షణకు మనందరం పాటుపడాలన్నారు. జీవ వైవిధ్యం దెబ్బతింటే మానవాళి మనుగడకే ప్రమాదమన్నారు. విద్యార్థులకు పర్యావరణ, జీవన విలువలు, నైపుణ్యాలపై అవగాహన కల్పించి భవిష్యత్తు పరిరక్షకులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత టీచర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, రాష్ట్ర కో-ఆర్డినేటర్ వై.వెంకట్‌రెడ్డి, ప్రతినిధులు అనుదీప్, నగేశ్, శంకరయ్య లక్ష్మీప్రసన్న, హరిత తదితరులు పాల్గొన్నారు.

పేరు ఉంది.. ఊరే లేదు!

- వందల ఏళ్లుగా కనిపించని జనం
- దర్శనమిస్తున్న చారిత్రాత్మక సాక్ష్యాలు
- అయినా ఆ ఊరు పేరుతో రెవెన్యూ భూములు
- తాండూరు మండలం మాచనూరుపై ప్రత్యేకం



ఊరిలో ఉన్న పురాతన కాలం నాటి రావిచెట్టు



బీరప్పస్వామి ఏర్పాటు చేసుకున్న ఆశ్రమం

తాండూరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : తాండూరు మండలంలోని మాచనూరు లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా నుంచి బషీరాబాద్ వెళ్లే రోడ్డులో ఉంటుంది. వందలసంవత్సరాల క్రితం మాచనూరు గ్రామంగా ఉండేది. ఇది కుగ్రామంగా ఉండేదని పూర్వీకులు చెబుతుంటారు. కానీ, గ్రామం ఉందని చెప్పడానికి ఆనవాళ్లుగా ఇక్కడ చాలానే గుర్తులు ఉన్నాయి. కోట గోడ, ఆంజనేయస్వామి దేవాలయం, పురాతనకాలం నాటి రావిచెట్టు, బురుజు వంటివి సాక్ష్యాలుగా దర్శనమిస్తున్నాయి.

ఊరు ఖాళీ అయిందిలా..

పురాతన కాలంలో మాచనూరు గ్రామంలో చాలా మంది జనాభా ఉండేదని పెద్దలు చెబుతుంటారు. అయితే గ్రామంలో దొంగల బెడదతో తీవ్రంగా ఇబ్బందులు పడిన జనం ఏం చేయాలో తెలియక ఊరు ఖాళీ చేసేందుకు నిర్ణయించుకున్నారు. అనంతరం ఇళ్లు ఖాళీ చేసి గ్రామాన్ని వదిలి చుట్టుపక్కల ఉన్న గోనూరు, నారాయణపూర్, కాశీపూర్ గ్రామాలకు వెళ్లిపోయినట్లు కొందరు చెబుతున్నారు. కాగా, మాచనూరు రెవెన్యూ గ్రామం పేరిట గోనూరు గ్రామ భూములు 250 ఎకరాల్లో ఉన్నాయి. ప్రస్తుతం ఊర్లో జనం లేకపోయినా రికార్డుల్లో మాత్రం ఇప్పటికీ మాచనూరు పేరునే వ్యవసాయ భూములు రికార్డుల్లో కొనసాగుతున్నాయి.

ఇక్కడ కొనసాగుతున్న ఆశ్రమం

కర్ణాటక రాష్ట్రానికి చెందిన బీరప్పస్వామి కొన్నేళ్ల క్రితం జనంలేని మాచనూరుకు వచ్చి ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ ఉన్న పురాతన కాలం నాటి రావిచెట్టు దగ్గర ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే బీరప్ప స్వామి లింగైక్యం(మరణించడం) పొందారు. దీంతో కర్ణాటక రాష్ట్రం చించోళీ ప్రాంతానికి చెందిన శ్రీశ్రీ శివయోగి షీలలింగస్వామి బీరప్ప స్వామి ఇక్కడికి వచ్చి ఆశ్రమాన్ని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం జనంలేని ఆ ఊళ్లో ఈ ఆశ్రమం కొనసాగుతోంది.

ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న ఆశ్రమం



మాచనూరు గ్రామంలో జనం లేరు. ఇక్కడ బీరప్పస్వామి ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయన శివైక్యం చెందిన తర్వాత ఎనిమదేళ్లగా నేను ఆశ్రమాన్ని కొనసాగిస్తున్నాను. ఇక్కడ జనం లేకపోయినా ప్రతీ ఆది, మంగళవారాల్లో భక్తులు ఆశ్రమాన్ని సందర్శించేందుకు వస్తుంటారు. ఇక్కడ ఏర్పాట్లు సరిగ్గా లేకపోవడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. అయితే కొందరు చుట్టుపక్కల గ్రామస్తుల వారు మా ఆశ్రమానికి రోడ్డు వేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. - శివయోగి షీలలింగ స్వామి బీరప్పస్వామి, మాచనూరు



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

జిల్లా అభివృద్ధికి స్పీకర్ కృషి

మర్పల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వెనకబడిన జిల్లాను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వుడా) ఏర్పాటుకు కృషిచేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ మేరకు మండల కాంగ్రెస్ నాయకులు గురువారం స్పీకర్‌ను శాలువాలతో సన్మానించారు. హైదరాబాద్‌కు దగ్గరలో ఉన్నా వికారాబాద్ జిల్లా అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని, వుడాతో జిల్లాలోని అన్ని గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయన్నారు. అశోక్, సంజీవరెడ్డి, సుగ్రీవ్, ఈశ్వర్, రాజు, రాజశేఖర్ ధన్యవాదాలు తెలిపారు.

మహిళల అక్రమ రవాణా నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో తులసి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు, మహిళల అక్రమ రవాణా నిర్మూలనకు సమాజంలోని అందరి భాగస్వామ్యం అవసరమని ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి సీడీపీవో తులసి, ఎంపీడీవో వెంకటమ్మ అన్నారు. జిల్లా శిశు సంక్షేమ శాఖ ఇబ్రహీంపట్నం ప్రాజెక్ట్, ప్రజ్వల సంస్థల ఆధ్వర్యంలో మండల పరిషత్‌లో అంగన్‌వాడీ టీచర్లకు రెండురోజుల శిక్షణ కార్యాక్రమం గురువారం ప్రారంభమైంది. వారు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచ వ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న ప్రమాదకరం అంశం అన్నారు. ఎంతో మంది అమ్మాయిల జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. పేద, మధ్య తరగతి అమ్మాయిలు, మహిళలు ఈ నేరపూరిత చర్యలకు గురవుతున్నారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దీనిని అడ్డుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఉద్యోగం, సినిమా చాన్సులు, ప్రేమ పెళ్లి పేరుతో మోసాలకు పాల్పడుతూ మానవ అక్రమ రవాణాలకు పాల్పడుతున్నారని ఆవేదవ్యక్తం చేశారు. దీనిపై సమాజంలో అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా యుక్త వయస్సు బాలికలు, మహిళా సంఘాల సభ్యులకు వివరించాలన్నారు. ఫోన్ ఇనియోగంతో కలుగుతున్న నష్టాలపై కూడా పిల్లలకు తెలియజేయాలని అన్నారు. ప్రజ్వల సంస్థ స్టేట్ కో-ఆర్డినేటర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా తమ సంస్థ నిరంతరం కృషిచేస్తోందన్నారు. ఆన్‌లైన్ మోసాలపై డాక్యుమెంటరీ ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పల్లవి, సరళ, కల్పన, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పొదుపులో మహిళలదే ప్రధానపాత్ర



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సత్యనారాయణ

పెద్దేముల్, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): పొదుపు చేయడంలో మహిళలదే ప్రధానపాత్ర అని మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో గురువారం మండల మహిళా పరస్పర సహాయ సహకార పొదుపు సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన ప్రత్యేకాధికారి సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి లక్షల్లో రుణాలు అందజేస్తోందని తెలిపారు. ఏపీఎం బాలయ్య మాట్లాడుతూ మహిళా సంఘాలు అభివృద్ధి సాధిస్తుండడంతో బ్యాంకులు కూడా ఎలాంటి ష్యూరిటీలు లేకుండానే ఒక్కో గ్రూపునకు రూ.20లక్షల వరకు రుణాలను అందజేస్తున్నాయని తెలిపారు. పెద్దేముల్ మండలంలో మొత్తం 947సంఘాలు ఉంటే ఆ సంఘాలు పొదుపు చేసుకున్న డబ్బులు సుమారు రూ.10కోట్లు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జర్నప్ప, ఆండాలమ్మ, అక్షయ, పద్మమ్మ మంజుల పాల్గొన్నారు.

రిక్వెస్ట్ స్టాప్‌లో బస్సు నిలపాలని నిరసన



జీవన్గిలో బస్సును అడ్డగించి నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

బషీరాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రిక్వెస్ట్ బస్టాప్‌లో ఆర్టీసీ బస్సు నిలపాలని జీవన్గి గ్రామ బీసీ, ఎస్సీ కాలనీ వాసులు పలువురు గురువారం బస్సును అడ్డగించి నిరసన వ్యక్తం చేశారు. గతంలో గ్రామంలోని వాటర్ ట్యాంక్ వద్ద బస్సును ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవాలని కోరినా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడి కాలనీవాసులు బర్కాల బస్టాప్ వరకు నడిచివెళ్లి బస్సు ఎక్కాలంటే వృద్ధులు, మహిళలు రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఈ విషయమై పలుమార్లు ఆర్టీసీ అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదని వారన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి రిక్వెస్ట్ బస్టాప్‌లో బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కొనుగోలు కేంద్రాల్లో సదుపాయాల్లేవ్



కొనుగోలు కేంద్రం వద్ద రైతులు, నిర్వాహకులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మాదారం, ఎదులాబాదుల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన సందర్శించారు. మాదారంలో ఈ నెల 7న కేంద్రాన్ని ప్రారంభించినా ఒక్క ఇత్తు కూడా కొనలేదన్నారు. దీన్ని బట్టే కొనుగోలు కేంద్రం ఎలా పనిచేస్తోందో తెలుస్తోందన్నారు. వ్యాపారులకు అమ్ముకునేందుకే రైతులు మొగ్గు చూపుతున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించకపోవడం వల్లే రైతులు ప్రైవేట్‌గా వడ్లను అమ్ముకుంటున్నారని తెలిపారు. రైతులకు తాగడానికి నీరు. రాత్రి సమయాల్లో లైట్లులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా పదుపాయాలు కల్పించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ జిల్లాల పోచిరెడ్డి, నల్లోళ్ల యాదగిరి, మశ్చేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీశైలం, కుమార్, మల్లేష్, లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పరిగి రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న నాగర్‌కర్నూల్ పీవీ.రావు సభా ప్రాంగణంలో నిర్వహించే మాలల ఆత్మ గౌరవ సభను విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బి.వెంకటయ్య, అంబేడ్కర్ విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ముత్తయ్య కోరారు. పరిగిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం సభకు సంబంధించి ప్రచార వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు నర్సింహులు, మాల మహానాడు నాయకులు వెంకటయ్య, ఎం.వెంకట్, శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో అవకతవకలు జరిగితే చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్

యాలాల, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఆర్‌డీవో శ్రీనివాస్ హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఏడాదిగా చేసిన పనులపై సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీవో శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా ఉపాధి పనుల విషయంలో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏడాది కాలంలో చెరువులు, కాల్వల పూడికతీత, రైతుల పొలాల్లో చేసిన ల్యాండ్ డెవలప్‌మెంట్ పనులపై ఆడిట్ చేశామన్నారు. రైతులకు, రైతు కూలీలకు ఈ పథకం ద్వారా మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సరళ, ఏపీవో భార్గవి, రాములు, ఎంపీడీవో పుష్పలీల, ఎంపీఈవో యాదయ్య, ఎస్ఆర్పీ రవి, ఏపీవో జనార్దన్, టెక్నికల్ అసిసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి



బహుమతులు అందజేస్తున్న హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజ స్థాపనకు ప్రతీఒక్కరు కృషిచేయాలని అంకుశాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి తెలిపారు. అంకుశాపూర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం హెచ్‌పీసీఎల్ సంస్థ ఆధ్వర్యంలో విజిలెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించి క్విజ్ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు హెచ్‌పీసీఎల్ సంస్థ బహుమతులను ప్రదానం చేసింది. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ చేరిన అయ్యప్ప స్వాములు

మేడ్చల్ టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బాసర నుంచి శబరిమలకు కాలినడక బయల్దేరిన 62 మంది అయ్యప్ప స్వాములు బుధవారం రాత్రి మేడ్చల్ చేరుకున్నారు. అయ్యప్పస్వాములకు రంజిత్‌రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో పూజ, అల్పాహార ఏర్పాట్లు చేశారు.

సౌకర్యం ఉన్నా.. ప్రయోజనం సున్నా

- మేడ్చల్ ఆస్పత్రిలో తుప్పుపడుతున్న ఎక్స్‌రే యంత్రం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- తప్పక ప్రైవేట్‌లో ఎక్స్‌రే కోసం వెళ్తున్న పేదలు

మేడ్చల్ టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రిలో లక్షలు ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన ఎక్స్‌రే యంత్రానికి తుప్పుపట్టే పరిస్థితి నెలకొంది. పదేళ్ల క్రితం మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రిని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మారుస్తూ అందులో ప్రత్యేకంగా క్షయ వ్యాధిగ్రస్తులకు చికిత్స అందజేయాలన్న ఉద్దేశంతో క్షయ నివారణ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా ప్రత్యేకంగా రూ.10 లక్షలు వెచ్చించి అధునాతన ఎక్స్‌రే యంత్రాన్ని కొనుగోలు చేశారు. యంత్రం ఏర్పాటు చేసిన కొత్తలో పరీక్షలు నిర్వహించి రోగులకు వైద్య సేవలు అందించారు. రానురాను ఆ యంత్రంలో వాడే ఎక్స్‌రే ఫిల్మ్, ఫిల్మ్ డెవలప్ కోసం ఉపయోగించే రసాయనాలను సరఫరా చేయటం మానేశారు. దీంతో క్షయ వ్యాధిగ్రస్తులకు ఎక్స్‌రే తీసే వీలులేకుండా పోయింది. ఎవరైన రోగులు బయట ప్రైవేటులో పరీక్షలు చేసుకుని రిపోర్టు తీసుకొచ్చి డాక్టర్లకు చూపెడితే చికిత్స చేస్తున్న పరిస్థితి. ఉన్నత అధికారులు ఎక్స్‌రే యంత్రం నిర్వహణను విస్మరించడంతో ఎనిమిదేళ్లగా ఆ ఎక్స్‌రే యంత్రం మూలన పడింది. ఈ విషయమై స్థానికులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకున్న పాపానపోవడం లేదు.



మేడ్చల్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్

ఇక దాతలే ఆదుకోవాలి

ఈ యంత్రం నిర్వహణ కోసం ఎవరైన దాతలు ముందుకు వచ్చి అవసరమైన సామగ్రిని ఆసుపత్రి నిర్వాహకులకు ఇప్పిస్తే యంత్రంతో నిరుపేదలకు ప్రయోజనం కలిగే వీలు లేకపోలేదు. యంత్రం ఆపరేట్ చేసే టెక్నీషియన్ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నారు. యంత్రం నిర్వహణకు సంబంధించిన ఎక్స్‌రే ఫిల్మ్, ఫొటో డెవలప్ చేసే రసాయనాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. సుమారు 100 ఎక్స్‌రేలు తీసేందుకు ఉపయోగ పడే ఎక్స్‌రే ఫిల్మ్‌లు , రసాయనాలకు రూ.6 వేల వరకు ఖర్చు అవుతుందని టెక్నీషియన్లు చెబుతున్నారు. ఆసుపత్రిలో నిరుపేదలకు ప్రతీ రోజు 5-10 ఎక్స్‌రేలు తీసినప్పటికీ నెలకు 200 ఎక్స్‌రేలు తీయ వచ్చు. అందుకుగాను ప్రతీ నెల కనీసం రూ.10-15వేలు ఖర్చు అవుతుంది. ఎవరైన దాతలు లేక స్థానిక పారిశ్రామిక వాడలోని పరిశ్రమల యజమానులు, సామాజిక సేవలందించే స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి ఎక్స్‌రే యంత్రం నిర్వహణ బాధ్యత తీసుకుని సామగ్రి ఇప్పిస్తే ఈ యంత్రాన్ని వాడకంలోకి తీసుకొచ్చి నిరుపేదలకు వైద్య సేవలందించే వీలుకలగనుంది.

సామగ్రి అందుబాటులో లేకనే



వృథాగా పడి ఉన్న ఎక్స్‌రే మిషన్

ఎక్స్‌రే యంత్రం పాతమోడల్ కావడంతో యంత్రాన్ని వినియోగించడానికి ఉపయోగపడే పరికరాల ఇండెంట్‌ను ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని వైద్యులు అంటున్నారు. ప్రస్తుతం ఆధునిక డిజిటల్ యంత్రాలు వాడుతున్నందున పాత యంత్రానికి సంబంధించిన పరికరాల గురించి ఇండెంట్ పెట్టినా ఉన్నత అధికారులు పంపని పరిస్థితి నెలకొంది. గతంలో ఎన్నో సార్లు యంత్రాన్ని వాడకంలోకి తీసకురావడానికి ప్రయత్నించినప్పటికీ ఎక్స్‌రే ఫిల్మ్ కడగటానికి ఉపయోగ పడే రసాయనాలను ప్రభుత్వం ద్వార సరఫరా కాలేదని తద్వార చేసేది ఏమి లేక వదిలేశామని ఓ వైద్యాధికారి తెలిపారు.

సర్వర్ సమస్య.. బ్యాంకు మూత!

ఇబ్బంది పడిన ఎస్‌బీఐ ఖాతాదారులు



బషీరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ ఎస్‌బీఐలో గురువారం మధ్యాహ్నం తర్వాత లావాదేవీలు స్తంభించడంతో ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు. ఇదేంటని బ్యాంకర్లను అడిగితే సర్వర్ సమస్య ఉందని చెప్పి ప్రధాన ద్వారం మూసివేసినట్లు ఖాతాదారులు వాపోయారు. దీంతో ఖాతాదారులు పలువురు గంటల తరబడి బయట వేచి చూశారు. చేసేదిలేక ఖాతాదారులు ఉసూరుమంటూ ఇంటిబాట పట్టారు. ఎప్పుడొచ్చినా ఇక్కడి బ్యాంకులో ఏదో ఒక సమస్య ఉత్పన్నమవుతుందని ఖాతాదారులు ఆరోపించారు.

ధారూరు పీహెచ్‌సీ వైద్యాధికారిగా నిషాసింగ్



ధారూరు, అక్టోబరు(ఆంధ్రజ్యోతి) 24: ధారూరు పీహెచ్‌సీ వైద్యాధికారిగా నిషాసింగ్‌ను నియమితులయ్యారు. వైద్యుల కొత్త నియమాకాల్లో భాగంగా ఆమెను ఇక్కడికి కేటాయించారు. కాగా ఇక్కడ పని చేసిన డాక్టర్ సుష్మా సంగారెడ్డికి బదిలీపై వెళ్లారు.



పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏసీపీ రంగస్వామి

పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలి

చౌదరిగూడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో పోలీస్ శాఖ మీద నమ్మకాన్ని పెంచే విధంగా పోలీస్ విధానాన్ని అమలు చేయాలని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి అన్నారు. గురువారం కొందుర్గు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు, క్రైం వివరాలను ఎస్సై కృష్ణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు న్యాయంకోసం వచ్చే వారిపట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, వారికి అందుబాటులో ఉంటూ సమస్యలు విని న్యాయం చేసేందుకు పోలీస్‌లు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందికి విధుల పట్ల ఏసీపీ పలు సూచనలు చేశారు. షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్యతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నిలిచిన రోడ్డు పనులు.. నిత్యం ఇబ్బందులు

- లచ్చంపేట్-లాలాపేట్ మధ్య బీటీ పనులకు బ్రేక్
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

చౌదరిగూడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రెండు గ్రామాలకు ఎంతో క్లిష్టమైన రోడ్డు పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఈ రహదారి వెంట నిత్యం పంట పొలాలకు రైతులు, ఇతర పనుల నిమిత్తం ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. అయితే, ఓ ఇద్దరు రైతుల అభ్యంతరంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి. వివరాల్లోకి వెళితే.. గతంలో జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్ నుంచి లాలాపేట్ వరకు దాదాపుగా రోడ్డు పనులను పూర్తిచేశారు. కానీ, లచ్చంపేట్, లాలాపేట్ గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణ పనులు అర్థంతరంగా మధ్యలోనే నిలిచిపోయాయి.

బీటీ వేయక రాకపోకలకు ఇబ్బంది

జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని లచ్చంపేట్ గ్రామం నుంచి లాలాపేట్ మీదుగా షాబాద్ మండలంతో పాటు హైదరాబాద్‌కు నిత్యం ప్రజలు వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. కాగా, ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న రోడ్డు నుంచి ఏళ్లుగా ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో ప్రభుత్వం బీటీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడంతో లచ్చంపేట్ వాగు శివారులో పనులు చేపడుతుండగా ఓ ఇద్దరు



లచ్చంపేట్-లాలాపేట్ రహదారి

రైతులు తమ వ్యవసాయ పొలంలో నుంచి రోడ్డు వేస్తున్నారని అభ్యంతరం చెప్పడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. అనంతరం నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులపై ఓ రైతు జిల్లేడ్ చౌదరిగూడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు కూడా చేసినట్లు సమాచారం. అలాగే లాలాపేట్, ఉమ్మెంత్యాల వాగులో బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టకపోవడంతో వాగులో ప్రయాణం నరకంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో వాగులో ద్విచక్రవాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందించి లచ్చంపేట, లాలాపేట్ గ్రామాల మధ్య అర్థంతరంగా నిలిచిన రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి



రోడ్డు నిర్మాణ పనులను అర్థంతరంగా నిలిచి పోవడంతో పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా ఏదైనా పనిమీద రాత్రి సమయాల్లో ఆ రహదారి వెంట వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆగినపోయిన రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలి.

- బాల్‌రాజ్, లచ్చంపేట్, జిల్లేడ్-చౌదరిగూడ మండలం

పొలాలకు వెళ్లలేకపోతున్నాం



రోడ్డు నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోవడంతో పంటపొలాలకు వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడుతున్నాం. పంట కోతల కోసం మిషన్లు, సంచులు, ఇతర వ్యవసాయ సామగ్రి తీసుకుపోవాలంటే కష్టంగా ఉంది. బీటీ రోడ్డు వేసి రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలి.

- శ్రీకాంత్‌రెడ్డి, లాలాపేట్, కొందుర్గు మండలం

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



శంషాబాద్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలోని తొండుపల్లి శివారులో గల టోల్‌గేటు వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి (65) మృతదేహం లభ్యమైంది. ఎస్సై కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు బుధవారం అర్థరాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని సమాచారం అందింది. వారు అక్కడికి చేరుకొని పరిశీలించగా ఆ వ్యక్తి అప్పటికే మృతిచెందాడు. ఈ సంఘటనపై పోలీసు సిబ్బంది నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గత నాలుగు రోజుల క్రితం తొండుపల్లి గ్రామంలో బిక్షాటన చేస్తూ ఉండేవాడని తెలిసిందన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణ శివారులోని హైదరాబాద్ రోడ్డులో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. నందిగామ మండలం వెంకమ్మగూడకు చెందిన మహేందర్(31), వీరేందర్(34) గురువారం స్వగ్రామం నుంచి బైక్‌పై షాద్‌నగర్ వస్తూ పట్టణ సమీపంలో రోడ్డు క్రాస్ చేస్తుండగా షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ అతి వేగంగా, అజాగ్రత్తగా నడిపి బైక్‌ను ఢీకొట్టాడు. దాంతో మహేందర్ కాలు విరిగింది. వీరేందర్‌కు గాయాలయ్యాయి. పెట్రోలింగ్ పోలీసులు అక్కడికి చేరుకొని క్షతగాత్రులను షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారి బావ రవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ చెప్పారు.

గుట్ట తిరువీధిలో భక్తుడికి గుండెపోటు

- పీహెచ్‌సీకి తరలిస్తుండగా మృతి.. యాదగిరిగుట్ట కొండపై ఘటన

భువనగిరి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శనానికి వచ్చిన భక్తుడు గుండెపోటుతో మృతిచెందాడు. గురువారం సాయంత్రం రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మేకగూడ గ్రామానికి చెందిన దేశపాక పోశయ్య (55) లక్ష్మీనృసింహుడిని దర్శించుకునేందుకు కుటుంబ సభ్యులతో వచ్చాడు. దర్శనం అనంతరం మాడవీధుల్లోకి రాగా ఛాతిలో నొప్పి రావడంతో ఆలయ సిబ్బంది, కుటుంబ సభ్యులు బ్యాటరీ వాహనంలో కొండకింద యాదగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



రావిరాల పెద్దచెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాక ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. గురువారం తుక్కుగూడ మున్సిపాలిటీలోని రావిరాల పెద్ద చెరువుకట్టపై కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించడంతో పాటు పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజానీకానికి అనేక రకాల సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి అమలు పరిచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ సంపూర్ణంగా అమలు పర్చడంలేదన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్న కాంగ్రెస్.. ఇప్పటికీ నెరవేర్చడం లేదన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన నిధులను ఆపడమే కాకుండా.. అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. చెరువుల సుందరీకణ పనులు కొనసాగుతుండగా కొందరు కాంగ్రెస్ నేతలు ఆపనులను పదేపదే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు ఎవరికి ఎలా సమాధానం చెప్పాలో వారికి తెలుసని సబితారెడ్డి పరోక్షంగా కొందరు కాంగ్రెస్ నాయకులపై మండిపడ్డారు. తుక్కుగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ హేమలతా రాజుగౌడ్, కౌన్సిలర్లు, కమిషనర్ వెంకట్‌రామ్‌తో పాటు బీఆర్ఎస్ తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షుడు జె.లక్ష్మయ్య, బాట సురేష్, చంద్రశేఖర్‌రెడ్డి, సామ్యేల్‌రాజు, యాదయ్య, సుమన్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

పట్టా భూమిని ఆన్‌లైన్ చేయాలి

- అధికారులు పట్టించుకోవడం లేదు : బాధిత రైతు



రైతు బైకని సాయిలు

యాచారం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తన పట్టా భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రెండేళ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. యాచారం మండలంలోని నానక్‌నగర్‌కు చెందిన బైకని సాయిలుకు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్లు 239లో రెండెకరాల భూమి, 159లో ఎకరంన్నర పట్టాభూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రెండేళ్లుగా అడుతుగున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట విలేకరులతో తన గోడు వెళ్లబోసుకున్నాడు. తనకు న్యాయం చేయడంలో గతంలో బీఆర్ఎస్.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వాలు న్యాయం చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా సాయిలు కన్నీటి పర్యంతమయ్యాడు. తన గోడును అధికారులు పట్టించుకోకపోగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలేవీ అందడం లేదని తెలిపాడు. న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరాడు.

సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్ బక్కన్నయాదవ్

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలో నవంబరు 10న సాయంత్రం నిర్వహించతలపెట్టిన సదర్ సమ్మేళనం ఉత్సవాన్ని విజయవంతం చేయాలని షాద్‌నగర్ సింగిల్‌విండో చైర్మన్ డి.బక్కన్నయాదవ్ పిలుపునిచ్చారు. షాద్‌నగర్ యాదవ సదర్ సమ్మేళనం సన్నాహక సమావేశాన్ని గురువారం స్థానిక మల్లికార్జున మినీ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బక్కన్నయాదవ్ మాట్లాడుతూ సదర్ ఉత్సవం యాదవుల పండగని, భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఉత్సవానికి పార్టీలకతీతంగా నియోజకవర్గంలోని ప్రతీ యాదవ్ హాజరుకావాలని కోరారు. గడ్డం శ్రీనివాస్‌యాదవ్, రఘునాథ్‌యాదవ్, యాదగిరియాదవ్, జంగా నర్సింహయాదవ్, తుమ్మల నర్సింహయాదవ్, షాబాద్ మల్లేష్ యాదవ్, బాత్కు దేవేందర్‌యాదవ్, మేడే కృష్ణయాదవ్, అలుగడ్డ ప్రవీణ్ యాదవ్, నక్క బాల్‌రాజ్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, మన్నే నారాయణయాదవ్, వెంకటేష్‌యాదవ్, పరందాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణయ్య కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం చేస్తున్న నాయకులు

తలకొండపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గట్టిప్పలపల్లి గ్రామానికి చెందిన కావలి కృష్ణయ్య ఇటీవల మృతి చెందాడు. కొంత కాలం వీఆర్ఏగా విధులు నిర్వహించి మిషన్ భగీరథలో విధులు నిర్వహిస్తూ మృతి చెందాడు. కృష్ణయ్య కుటుంబానికి పూర్వపు వీఆర్ఏలుగా పనిచేసి ప్రస్తుతం వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కృష్ణయ్య కుటుంబానికి రూ.10,500 సమకూర్చి గురువారం అందజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రమేశ్, మల్లేశ్, చంద్రమౌళి, పాండు, తదితరులు ఉన్నారు.

దోడ్డిదారి!

(5వ పేజీ తరువాయి)

వెలువరించినప్పటికీ ఆ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. ఇటీవల ఆమనగల్లు మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ పీటీ జ్యోతిని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం జడ్పీహెచ్ఎస్ తాటి అన్నారం గ్రామ పాఠశాలకు ఈనెల 19వ తేదీన డిప్యుటేషన్ వేశారు. కడ్తాల్ మండలంలోని రావిచెడు గ్రామ పాఠశాలలో సోషల్ సబ్జెక్టు బోధించే శ్రీదేవి అనే ఉపాధ్యాయురాలిని కూడా డిప్యుటేషన్ ఉత్తర్వులు వెలువరించారు. జెడ్పీహెచ్ఎస్ చౌదరిగూడ పాఠశాలలో తెలుగు సబ్జెక్టు బోధిస్తున్న కె.శైలజ సరూర్‌నగర్ మండలం వనస్థలిపురం జెడ్పీహెచ్ఎస్‌కు ఈనెల 21న డిప్యుటేషన్ ఉత్తర్వులు ఇవ్వడంతో విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టారు. ఇటీవలె బదిలీపై వచ్చిన ఉపాధ్యాయురాలు శైలజ మళ్లీ డిప్యుటేషన్‌పై వెళ్లడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ పాఠశాలలో 356 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 16 మంది టీచర్లు ఉండాల్సి ఉండగా 14 మంది ఉన్నారు. రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గణితం పోస్టులు మూడు మంజూరు ఉండగా ఒకే ఒక్కరు విధులు నిర్వర్తిస్తున్నారు.

అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలని ఆందోళన



ధర్నాలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ ఇన్‌చార్జి ఆకాష్

అక్రమ డిప్యుటేషన్లను వెంటనే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ ఇన్‌చార్జి ఆకాష్ డిమాండ్ చేశారు. గురువారం చౌదరిగూడ జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. పాఠశాల వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. తెలుగు సబ్జెక్టు బోధిస్తున్న కె. శైలజ సరూర్‌నగర్ మండలం వనస్థలిపురం జెడ్పీహెచ్ఎస్‌కు వేసిన డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసంవత్సరం మధ్యలో డిప్యుటేషన్లు వేయడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వారు అన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నాయకులు

అక్రమ బదిలీలు అరికట్టాలి

అక్రమ బదిలీలను వెంటనే అరికట్టాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్ నాయక్, వెంకటప్ప గురువారం కలెక్టర్ శశాంకకు వినతి పత్రం సమర్పించారు. మహబూబ్‌నగర్ జిల్లా బాల్‌నగర్ మండలం, శేరిగూడ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ కృష్ణవేణిని రాజేంద్రనగర్ మండలం శివరాంపల్లి ఎంపీపీఎస్ స్కూల్‌కు కోర్టు ఆర్డర్ ద్వారా బదిలీపై పంపించారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్థానికేతరులు జిల్లాకు రావడంతో రంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని వారు తెలిపారు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అక్రమ బదిలీలు, డిప్యుటేషన్లు జరుగుతున్నాయని వారు ఆరోపించారు.

డిప్యుటేషన్లతో పిల్లలు నష్టపోతున్నారు



అక్రమ డిప్యుటేషన్ల కారణంగా పిల్లలు నష్టపోతున్నారు. విద్యాశాఖలో కొనసాగుతున్న అక్రమ డిప్యుటేషన్లను వెంటనే రద్దు చేయాలి. ఇప్పటికే పాఠశాలలో లెక్కల టీచర్ ఒక్కరే ఉన్నారు. తెలుగు బోధించే టీచర్ ఇటీవల బదిలీపై వచ్చారు. అంతలోనే డిప్యుటేషన్లపై పంపిస్తే ఎలా?. పనిచేయడం ఇష్టం లేకపోతే ఉద్యోగం మానేయాలి. వారి స్థానంలో కొత్త టీచర్లు వస్తారు.

- పి. శ్రీను, పేరెంట్, చౌదరిగూడ

డిప్యుటేషన్ల కారణంగా విద్యా వ్యవస్థ నిర్వీర్యం



మరో ఐదు నెలలు అయితే విద్యా సంవత్సరం ముగుస్తుంది. విద్యా సంవత్సరం మధ్యలో బదిలీలు, పదోన్నతులు, డిప్యుటేషన్లు జరుగుతున్నాయి. దీనివల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వేసవి సెలవుల్లో అన్ని సరిచేసుకోవాలి. ప్రభుత్వం ఈ విషయంపై ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

- పూసల రమేష్, పేరెంట్, చౌదరిగూడ

సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కనర్సింహారెడ్డి

కందుకూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదును మరింత ముమ్మరం చేయాలని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి కోరారు. గురువారం మండలంలోని ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ, దాసర్లపల్లి గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి పార్టీ సభ్యత్వ నమోదును చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మోదీ నాయకత్వంలో పదేళ్లుగా పేదల కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించి మోదీ నాయకత్వాన్ని బలపరిచాలని కోరారు. కార్యక్రమంలో బక్క మల్లేష్, కృష్ణయ్య, గడ్డం నాగిరెడ్డి, శ్రీను, కిషన్, రాఘవేందర్, చెన్నయ్య, రామకృష్ణ, దుర్గేష్, బాలరాజ్, రాజు, మహేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : ముచ్చర్లలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నర్సింహారెడ్డి

బీజేపీని బలోపేతం చేయడమే లక్ష్యం

చేవెళ్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామ గ్రామన బీజేపీ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నట్లు బీజేపీ చేవెళ్ల మండల ఉపాధ్యక్షుడు గౌండ్ల కృష్ణగౌడ్ తెలిపారు. బీజేపీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో ఇంటింటికి తిరిగి పార్టీ సభ్యత్వం చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ గ్రామన బీజేపీ మరింత బలోపేతం చేసేందుకు ఇంటింటికి వెళ్లి బీజేపీ సభ్యత్వం చేయించడం జరుగుతుందన్నారు. జిల్లాలోనే చేవెళ్ల మండలం బీజేపీ సభ్యత్వ నమోదులో ముందువరుసలో ఉంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నసంక్షేమ పథకాలు ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు ఆంజనేయులుగౌడ్, సీనియర్ నాయకులు దేవుని శర్వలింగం, ఇంద్రసేనారెడ్డి, పెద్దోళ్ల కృష్ణ, మాణిక్యం, వెంకటేశ్, గ్రామం బూత్ అధ్యక్షుడు శివకుమార్, గ్రామస్తులు, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



చేవెళ్ల : మల్కాపూర్‌లో సభ్యత్వాలు చేయిస్తున్న బీజేపీ నాయకులు

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి



మహాసభలో మాట్లాడుతున్న వెంకటయ్య

తలకొండపల్లి,అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, వాటిని ఎండగట్టాలని సీపీఎం జిల్లా సీనియర్ నాయకులు ఎం. యాదయ్య, ఆమనగల్లు ఏరియా కమిటీ కన్వీనర్ కానుగుల వెంకటయ్య లు అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకు ప్రజలంతా సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పడకల్ గ్రామంలో గురువారం సీపీఎం మహాసభలు నిర్వహించారు. కూలీలు, కార్మికులు, ప్రజా సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించారు. కాంగ్రెస్ హామీలను అమలు చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ కమిటీ కార్యదర్శి పెంటయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం కార్యదర్శిగా పెంటయ్య

సీపీఎం తలకొండపల్లి మండలం పడకల్ గ్రామ కార్యదర్శిగా జల్లెల పెంటయ్య ఎన్నికయ్యారు. నాయకులు ఎం.యాదయ్య, కానుగుల వెంకటయ్య, గుమ్మడి కురుమయ్యల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పెంటయ్యను నాయకులు సత్కరించి అభినందించారు. రమేశ్, పర్వతాలు, జంగయ్య, పోచయ్య, రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి

తలకొండపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీఎస్ఎస్‌వో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మీసాల వంశీ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వంశీ విలేకరులతో మాట్లాడుతూ పెండింగ్ బకాయిలు రూ.7,500 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో టీఎస్ఎస్‌వో ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకుండ కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే దిశగా ప్రభుత్వ కుట్ర చేస్తోందని ఆరోపించారు. బకాయిలు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని వంశీ కోరారు.

శంకర్‌ను అభినందించిన డోకూరు



ఎమ్మెల్యే శంకర్‌తో ప్రభాకర్ రెడ్డి

తలకొండపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్‌గా నియమితులైన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను గురువారం కాంగ్రెస్ పార్టీ తలకొండపల్లి మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. షాద్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వపరంగా తగిన నిధులందే లా చూడాలని కోరినట్లు చెప్పారు. నాయకులు నర్సింహులు, అజీం, తదితరులున్నారు.

ఆమనగల్లు పట్టణంలో డివిజనల్ కార్యాలయాల ఏర్పాటుకు కృషి

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలో డివిజనల్ కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వ పరంగా కృషి చేస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. నాలుగు మండలాలకు కూడలిగా ఉన్న ఆమనగల్లులో రెవెన్యూ డివిజినల్, సబ్ రిజిస్ట్రార్, సబ్‌ట్రెజరి, ఏసీపీ కార్యాలయాల ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించగా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో ప్రభుత్వ డివిజినల్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కేఎస్ఆర్ సేవాదళం అధ్యక్షుడు మెకానిక్‌బాబా స్థానిక ఎమ్మెల్యేను కోరారు. ఆమనగల్లు వైస్ ఎంపీపీ అనంతరెడ్డితో గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కసిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉన్న మాడ్గుల పోలీసు స్టేషన్‌ను సైబరాబాద్ కమిషనరేట్‌లోకి మార్చి ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు కలిపి ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే 4డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. నాయకులు తాళ్ల రవీందర్, విజయ్‌రాథోడ్, తదితరులు ఉన్నారు.

రాంపూర్ ఆలయ నూతన పాలక మండలి



నియామకపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

తలకొండపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాంపూర్ శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానానికి రాష్ట్ర ప్రభుత్వం నూతన పాలకవర్గాన్ని నియమించింది. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషన్ నుంచి ఈమేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎమ్మెల్యే కసిరెడ్డి ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం పాలక వర్గాన్ని నియమించింది. చైర్మన్‌గా జిల్లెల్ల పవన్‌కుమార్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా కాకి అమృత, డైరెక్టర్లుగా ఎం.స్వామి గౌడ్, డి.వెంకటయ్య, టి.యాదయ్య, డి.జంగయ్యలను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఆలయ అర్చకుడు నర్సింహచారి ఆలయ ఎక్స్ ఆఫీషియో మెంబర్‌గా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉత్తర్వులను ఎమ్మెల్యే నారాయణరెడ్డి పవన్‌కుమార్‌రెడ్డికి అందజేశారు. పవన్ కుమార్ రెడ్డిని నాయకులు శ్యామ్‌సుందర్ రెడ్డి, కృష్ణ, నయీమొద్దీన్, శివ, శ్రవణ్ కుమార్‌రెడ్డి, గ్రామ నాయకులు అభినందించారు.


బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గోవర్దన్‌రెడ్డికి సన్మానం



గోవర్దన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి, అక్టోబరు24(ఆంధ్ర జ్యోతి): బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గండిచెర్ల గోవర్దన్‌రెడ్డిని శంకర్‌పల్లి పట్టణానికి చెందిన పలువురు నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఇటీవల ఆయన మండలాధ్యక్షుడిగా ఎంపిక కాగా, పలువురు గజమాల వేసి శాలువాతో సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొంది ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. మల్లారెడ్డి, గోవర్దన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులున్నారు.

మాలల ఆత్మగౌరవ సభను జయప్రదం చేద్దాం



చర్లగూడలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆంజనేయులు, తదితరులు

షాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేద్దామని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట ఆంజనేయులు అన్నారు. గురువారం మండలంలోని చర్లగూడ, కేసారం తదితర గ్రామాల్లో సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ హక్కులు కల్పిస్తే, వాటిని కాలరాయాలని మనువాదుల చెంత చేరిన మందకృష్ణ మాదిగ స్వలాభం కోసం కుట్రపూరిత విధానంతో బీజేపీతో చేతులు కలిపి రిజర్వేషన్లకు తూట్లు పొడవాలని కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు. 27న జరిగే హలో మాల చలో నాగర్‌కర్నూల్ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. చంద్రశేఖర్, ఎల్లయ్య, శ్రీనివాస్, నర్సింహులు, రాజు, సమతా సైనిక్ దళ్ జిల్లా నాయకులు వెంకటేష్, కృష్ణ, ప్రవీణ్ తదితరులున్నారు.

విద్యా కమిషన్ సభ్యుడిని కలిసిన మహేశ్

ఆమనగల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడిగా నియమితులైన డాక్టర్ చారగొండ వెంకటేశ్‌ను గురువారం ఆమనగల్లు అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు వగ్గు మహేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పేద విద్యార్థుల విద్యాభ్యున్నతికి, ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి కృషి చేయాలని వెంకటేశ్‌ను కోరగా సానుకూలంగా స్పందించినట్లు మహేశ్ తెలిపారు. సురేశ్‌నాయక్, కిరణ్, యాదయ్య ఉన్నారు.